క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన


జీఎన్ కండ్రిగలో పనులను పరిశీలిస్తున్న పీడీ

నిండ్ర: మండలంలో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం పీడీ గంగాభవాని పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. జీఎన్ కండ్రిగ, కొప్పేడు గ్రామాల్లో చేసిన పనులను పరిశీలించారు. పనుల వివరాలను బోర్డులో నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కూలీలకు అవసరమైన పనులు కల్పించాలని సూచించారు. ఏపీడీ శోభన్ బాబు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం


రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ రాజేంద్రన్

గంగాధరనెల్లూరు: విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించాలని ఎంఈఓ రాజేంద్రన్ స్పష్టం చేశారు. శుక్రవారం మండలంలోని కలిజవేడు వెంకటాపురం, నాశంపల్లె, అక్కన్నగారిపల్లె ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. వంట గదిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండాలని ఆదేశించారు. ఉపాధ్యాయులకు ముఖ ఆధారిత హాజరు తప్పనిసరని వెల్లడించారు.

వాటర్ ప్లాంట్ల తనిఖీ


వాటర్ ప్లాంట్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

కార్వేటినగరం: మండల కేంద్రంలోని కేఆర్ మినరల్ వాటర్ ప్లాంట్, ఆర్‌ఓ ప్లాంట్‌ను శుక్రవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.ఈశ్వర్‌రెడ్డి తనిఖీ చేశారు. నీటి నాణ్యతలో రాజీ పడితే సహించే ప్రసక్తే లేదన్నారు. నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. అనంతనం ప్లాంట్ల లైసెన్స్‌లు పరిశీలించారు.

వడమాలపేటలో..



వడమాలపేట: మండలంలోని బట్టికండ్రిగలో ఉన్న వాటర్ ప్లాంటును శుక్రవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, లీగల్ మెట్రాలజీ అధికారులు తనిఖీ చేశారు. లైసెన్సు, నీటి నాణ్యత, శుభ్రతను పరిశీలించారు. వాటర్ బాటిల్‌పై ఉన్న ధరను చూసి ఎక్కువ ధరకు ఎందుకు అమ్ముతున్నారని ప్రశ్నించారు. ఈ దాడులు నిరంతరం కొనసాగుతాయని తిరుపతి ఫుడ్ సేఫ్టీ అధికారి ఈశ్వర్‌రెడ్డి తెలిపారు.

ఎరువుల తయారీతో ఆదాయం


డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ పురుషోత్తం

శ్రీరంగరాజపురం: మండలంలోని తయ్యూరు పంచాయతీ శెట్టివానత్తం, ఎస్సార్‌పురంలోని డంపింగ్ యార్డులను ఈఓపీఆర్డీ పురుషోత్తం శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేరు చేయడంపై పారిశుద్ధ్య కార్మికులకు అవగాహన కల్పించారు. చెత్త నుంచి ఎరువులు తయారీ ఆదాయం వస్తుందన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకులను పరిశీలించారు. కార్యక్రమంలో కార్యదర్శి జ్యోత్స్న, సర్పంచ్‌లు వరదమ్మ, హరిత పాల్గొన్నారు.

క్షయపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న మోహన్‌కృష్ణ, శివప్రకాష్

పాలసముద్రం: క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎస్.శివప్రకాష్ కోరారు. శుక్రవారం స్థానిక బీసీ బాలిక హస్టల్ విద్యార్థులకు వైద్యాధికారి మోహన్‌కృష్ణ ఆధ్వర్యంలో క్షయపై అవగాహన కల్పించారు. సకాలంలో వ్యాధిని గుర్తించి, మందులు క్రమం తప్పకుండా వాడితే కోలుకోవచ్చన్నారు. ఆకలి లేకపోయినా, రెండు వారాలకు మించి దగ్గు తగ్గకున్నా, అకస్మాత్తుగా బరువు కోల్పోయినా వెంటనే వైద్యులను సంప్రదించి పరీక్ష చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుశీల, మురళి పాల్గొన్నారు.

అభివృద్ధి.. సంక్షేమమే అజెండా

- ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం
- అర్హులందరికీ పథకాలు
- గడప గడపకు మన ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి


వృద్ధురాలితో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పెనుమూరు (కార్వేటినగరం): అభివృద్ధి.. సంక్షేమమే అజెండాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నట్లు డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. శుక్రవారం చింతపెంట సచివాలయ పరిధిలోని బండకిందపల్లె, తుర్పుపల్లె దళితవాడ, అమ్మవారిపల్లెలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్ పంపిణీ చేశారు. స్థానిక సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ అవినీతి రహితంగా.. పారదర్శకంగా.. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అమలవుతున్న పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనన్ననే గెలిపించాలని పిలుపునిచ్చారు. అలాగే తూర్పుపల్లెలో తాగుటి ట్యాంకు, డ్రైనేజీలు, పోలవరం నుంచి రామకృష్ణాపురం వరకు రోడ్డు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. బండకిందపల్లె అర్హులందరికీ ఇంటి పట్టా మంజూరు చేయాలని స్పష్టం చేశారు. అనంతరం ఎస్‌ఆర్‌ఐ కార్తీక్‌ను డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివయ్య, తహసీల్దార్ విజయకుమార్, పీఆర్ డీఈ దయాకర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ విజయకుమార్ రెడ్డి, సర్పంచ్ కోదండరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు సుబ్రమణ్యంరెడ్డి, నియోజకవర్గ మహిళ అధ్యక్షులు యశోదారెడ్డి, నేతలు నవీన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, దూది మోహన్, రాజారెడ్డి, మురళి, జయచంద్రా రెడ్డి పాల్గొన్నారు.

పేదలకు కొండంత అండ



పేదలకు కొండంత అండగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిలబడుతున్నారు. ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నారు. నాకు వైఎస్సార్ ఆసరా, అమ్మఒడి, రైతు భరోసా, జగనన్న చేదోడు కింద లబ్ధి చేకూరింది. మళ్లీ వైఎస్సార్‌పీ ప్రభుత్వమే రావాలి.

–సరోజమ్మ, తూర్పుపల్లె

మళ్లీ జగనన్నే రావాలి



ఇంటి తలుపు తట్టి మరీ వలంటీర్లు ప్రభుత్వ పథకాల లబ్ధి అందిస్తున్నారు. నాకు ఇప్పటి వరకు ఆసరా, రైతు భరోసా, అమ్మఒడి నగదు అందింది. ఎవరి చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా నేరుగా నా ఖాతాలోనే డబ్బులు వేశారు. పేదలను ఆదుకుంటున్న జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రిగా అధికారంలోకి రావాలి.

–ఈశ్వర్‌రెడ్డి, తూర్పుపల్లె

ముఖ్యమంత్రి చల్లగా ఉండాలి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చల్లగా ఉండాలి. ఇంటి పెద్ద కొడుకు లాగా ఆదుకుంటున్నారు. ఈ మూడేళ్లలో నాకు వైఎస్సార్ పింఛన్, రైతు భరోసా, పంట బీమా, ఇంటి స్థలం వచ్చాయి. ఇప్పటి వరకు సుమారు రూ.2.75లక్షల లబ్ధి చేకూరింది.

–పురుషోత్తం రెడ్డి, అమ్మవారిపల్లె

అన్నీ చేస్తున్నాం.. ఆశీర్వదించండి

- గడప గడపకూ మన ప్రభుత్వంలో మంత్రి ఆర్కే రోజా
- టీడీపీ ఇలాకాలో మంత్రికి అపూర్వ ఆదరణ


'గడప గడపకూ' కార్యక్రమంలో సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న మంత్రి ఆర్కే రోజా

పుత్తూరు రూరల్: అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్న జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడా శాఖా మంత్రి ఆర్కే రోజా కోరారు. ఆమె శుక్రవారం సాయంత్రం పుత్తూరు రూరల్ మండలం పరమేశ్వరమంగళం, వడ్డిండ్లు, ఏఏడబ్ల్యూ, బీసీ కాలనీ గ్రామాల్లో గడప పడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. టీడీపీకి కంచు కోటగా ఉన్న పరమేశ్వరమంగళంలో మంత్రి రోజాకు మహిళలు బ్రహ్మరథం పట్టారు. ఆమె ప్రతి ఇంటికీ వెళ్లి అవ్వా పెన్షన్ అందిందా? అక్కా చేయూత అందిందా? ఆసరా ఆదుకొనిందా? అంటూ అడిగి తెలుసుకున్నారు. వారు మూడున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరించారు. ఆమె మాట్లాడుతూ మూడున్నరేళ్లలో మేనిఫెస్టోలోని హామీల్లో 98 శాతం నెరవేర్చిన ఘనత మన సీఎం జగనన్నకే దక్కిందన్నారు. అవినీతికి తావులేకుండా వలంటీర్ల ద్వారా ప్రభుత్వ పథకాలు ఇంటి గుమ్మం వద్దకే వస్తున్నాయని చెప్పారు. గత ప్రభుత్వంలో ఏ నాయకుడైనా ఇంటి వద్దకు వచ్చి ప్రభుత్వం చేసిన మంచిని చెప్పిన దాఖలాలు లేవన్నారు. ఇది ఒక్క వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మాత్రమే సాధ్యమైందన్నారు. స్థానికంగా గుర్తించిన చిన్న చిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ మునివేలు, వైస్ ఎంపీపీ మునస్వామిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు గోవిందస్వామినాయుడు, నాద మునినాయుడు, చిరంజీవినాయుడు, సుబ్రమణ్యం నాయుడు, హరీష్, దాసు, శ్రీజా, హేమాద్రి, శీను, రాజా, బలరామ్, ఉదయ్, ఏసు, సుదర్శనం, లక్ష్మణమూర్తి, సింగిల్ విండో ప్రెసిడెంట్లు జయపాల్, శ్రీనివాసులురెడ్డి, సర్పంచులు గోవిందస్వామిరెడ్డి, మురళీయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రికి కుర్చీల వితరణ


సూపరింటెండెంట్‌కు కుర్చీలు అందజేస్తున్న దాత

నగరి: తెరణికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు మోహన్ శుక్రవారం స్థానిక ఏరియా ఆస్పత్రికి రూ.10 వేల విలువైన కుర్చీలు అందజేశారు. ఆయనకు ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ బాలకృష్ణనాయక్ కృతజ్ఞతలు తెలిపారు. ఆర్ఎంవో గోపాల్, నర్సింగ్ సూపరింటెండెంట్ రాజరత్నమ్మ పాల్గొన్నారు.

మెనూ ప్రకారమే మధ్యాహ్న భోజనం


భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ రాజేంద్రప్రసాద్

పాలసముద్రం: మండలంలోని వెంగళరాజుకుప్పం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఎంఈఓ రాజేంద్రప్రసాద్ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పిల్లలకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు. తాజా కూరగాయలనే వినియోగించాలని సూచించారు. విద్యార్థుల హాజరు పట్టికను వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చక్రధరరావు ఉన్నారు.

మరింత వేగంగా ఇళ్ల నిర్మాణం


లబ్ధిదారులతో మాట్లాడుతన్న కలెక్టర్

గంగాధరనెల్లూరు: జగనన్న కాలనీల్లో మరింత వేగంగా ఇళ్ల నిర్మాణం చేపట్టాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. శుక్రవారం జీడీనెల్లూరులోని లేఅవుట్‌ను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కార్యాచరణ అమలు చేస్తోందన్నారు. ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయించేందుకు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అనంతరం స్థానిక జెడ్పీ ఉన్నతపాఠశాను సందర్శించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. సమ్మేటివ్ పరీక్షల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అలాగే వెంకటాపురం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. గర్భిణులు, చిన్నారులకు సక్రమంగా పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. కలిజవేడు సచివాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. స్పందన కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. అలాగే నాశంపల్లెలో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీదేవి, తహసీల్దార్ ఇన్బనాథన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గాయత్రి, హౌసింగ్ డీఈ వెంకటేశ్వరావు, ఎంఈఓ రాజేంద్రన్, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ గుణశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు పాల్గొన్నారు.

పకడ్బందీగా భూముల రీ సర్వే


రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ సుజన

కార్వేటినగరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆర్డీఓ సుజన ఆదేశించారు. శుక్రవారం మండలంలోని పలు ప్రాంతాల్లో సాగుతున్న సర్వేను ఆమె పరిశీలించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా రెవెన్యూ సిబ్బంది సర్వే చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో సర్వే రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సర్వేయర్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

26 నుంచి ప్లాస్టిక్ బ్యానర్లు, ఫ్లెక్సీలు నిషేధం

నగరి: ఈ నెల 26వ తేదీ నుంచి ప్లాస్టిక్ బ్యానర్లు, ఫ్లెక్సీలను నిషేధిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ప్లాస్టిక్ బ్యానర్లు, ఫ్లెక్సీలు, ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్స్ (హోల్ సేల్, రిటైల్ షాప్) యజమానులు, వినియోగదారులు సహకరించి నగరి పట్టణాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కోరారు. ఉత్తర్వులను అతిక్రమిస్తే పర్యావరణ పరిరక్షణ చట్టం 1986 మేరకు ప్లాస్టిక్ బ్యానర్లు, ఫ్లెక్సీలకు చదపు అడుగుకు రూ.100ల చొప్పున, ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్స్ వినియోగదారులకు రూ.250 నుంచి రూ.500 వరకు, దుకాణదారులకు రూ.2500ల నుంచి రూ.40 వేల వరకు జరిమానా విధిస్తామని పేర్కొన్నారు.

కల్యాణం.. కమనీయం


కల్యాణోత్సవంలో వీరరాఘవస్వామి

నారాయణవనం: స్థానిక కనకవల్లీ, వేదవల్లీ సమేత వీరరాఘవస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. గురువారం సాయంత్రం గణపతి పూజతో మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం సాయంత్రం స్వామివారి కల్యాణం, రాత్రి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. శనివారం సాయంత్రం గరుడసేవ, ఆదివారం ఉదయం హనుమంత వాహన సేవ, రాత్రి చక్రస్నానంతో ఉత్సవాలు పరిసమాప్తవుతాయని దేవస్థానం ధర్మకర్త సుబ్రమణ్యం తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో చలువ పందిళ్లు వేసి, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. కల్యాణోత్సవంలో పాల్గొన్న మహిళలకు పసుపు, కుంకుమలను అందజేశారు.

'జలజీవన్'లో గ్రామ సంఘాలే కీలకం


గ్రామస్తులతో అవగాహన ర్యాలీ

పెనుమూరు (కార్వేటినగరం): జలజీవన్ మిషన్‌లో గ్రామ సంఘాలు కీలకమని మిషన్ జిల్లా కో–ఆర్డినేటర్ రఘునాథరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని సీఆర్ కండ్రి గ్రామ సచివాలయంలో జల జీవన్ మిషన్‌పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మంచి నీటి సరఫరాలో భాగంగా కొళాయిలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు గ్రామ సభల ద్వారా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుశీల, పట్టాభిరెడ్డి, దుర్గాప్రసాద్‌రెడ్డి, ఐఎస్ఈ మురళీమోహన్, సోషల్ మొబలైజేషన్ అల్లిబాబు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో సుజన

నగరి: బాల్య వివాహాలను పూర్తి స్థాయిలో అరికట్టాలని ఆర్డీవో సుజన ఆదేశించారు. ఆమె శుక్రవారం ఐసీడీఎస్, ఆరోగ్య విభాగం అధికారులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, బాలికలకు 18 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేయాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. బాలికను పెళ్లి చేసుకుంటే 2 ఏళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా తప్పదన్నారు. 18 ఏళ్లలోపు వారికి పెళ్లి చేస్తుంటే 1098, 100ను సంప్రదించాలని సూచించారు. ఉన్నత పాఠశాల, ఇంటర్మీడియట్ కళాశాలల్లో చదివే బాలబాలికలకు ఎంఈవో, ఎంపీడీవో, తహసీల్దార్, ఐసీడీఎస్, మెడికల్ ఆఫీసర్, పోలీసు విభాగం అధికారులు కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఎక్కడా బాల్యవివాహాలు జరగకుండా చూడాలని ఆదేశించారు. సీడీపీవో కృష్ణవేణి, నగరి, నిండ్ర, విజయపురం, కార్వేటినగరం, పాలసముద్రం మండలాల మెడికల్ ఆఫీసర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

యువతే దేశానికి వెన్నెముక



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న మంత్రి ఆర్కేరోజా

- కసి, పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమే
- మహిళను అణిచేందుకు క్యారెక్టర్‌పై దెబ్బ కొడతారు
- మంత్రి ఆర్కేరోజా

నగరి: యువతే దేశానికి వెన్నెముక అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడా శాఖల మంత్రి ఆర్కే రోజా తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఫ్రెషర్స్ డేలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మన దేశ జనాభాలో 50 శాతం మంది యువత ఉందన్నారు. యువత అనుకుంటే చరిత్ర సృష్టిస్తారని, తలరాతలు మారిపోతాయాయన్నారు. డిగ్రీ స్థాయి నుంచే భవిష్యత్తుపై సరైన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. తాను సినీ రంగానికి పరిచయమైనప్పుడు హీరోయిన్‌కి తగ్గ కలర్ లేదని, డైలాగులు పలకడం రావడం లేదని హేళన చేశారని తెలిపారు. తాను కసి, పట్టుదలతో అన్నీ నేర్చుకున్నానని తెలిపారు. తనతో పోటీ పడి డ్యాన్స్ చేసే వారు సినీ పరిశ్రమలో శిల్పాశెట్టి, రోజా అని స్వయానా డ్యాన్స్ దిగ్గజం ప్రభుదేవా అన్నారని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. తాను రాజకీయాల్లోకి వచ్చినప్పుడు నామినేషన్ చేసేందుకు ఒక్కరోజు ముందు సీటు ఇచ్చి నగరికి పంపారని తెలిపారు. కొంతమంది వెన్నుపోటు వలన తాను ఓడిపోవాల్సి వచ్చిందన్నారు. రెండోసారి చంద్రగిరిలోనూ ఓడిపోయానన్నారు. ఓడినా కుంగిపోలేదని ఓటమిని అనుభవంగా మార్చుకొని విజయం సాధించానన్నారు. ఎవరైతే తనని అసెంబ్లీలోకి రానివ్వకుండా చేశారో వారి ముందే తన సత్తాచాటానన్నారు. ప్రధానంగా మహిళలు ఏ రంగంలోనైనా ఉన్నత స్థాయికి చేరుకుంటుంటే వారిని మానసికంగా ఇబ్బంది పెట్టి వెనక్కి పంపించేందుకు ఎన్నో విధాలుగా ప్రయత్నిస్తారని తెలిపారు. ఇందులో భాగంగా వారి క్యారెక్టర్ మీద దెబ్బకొడతారని, మన క్యారెక్టర్ మీద తల్లిదండ్రులకన్నా మనకే ఎక్కువ నమ్మకం ఉండాలని వివరించారు. జీవిత గమ్యాన్ని చేరుకోవడానికి నిరంతరం విశ్వాసంతో కృషి చేయాలన్నారు. ఫ్రెషర్స్‌డే సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్, మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్ చైర్మన్ బాలన్, ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, ఎంపీడీవో చంద్రమౌళి, సీఐ శ్రీనివాసంతి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారించండి


డ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ రాజశేఖర్

నిండ్ర: మండలంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నగరి రూరల్ సీఐ రాజశేఖర్ తెలిపారు. ఆయన శుక్రవారం రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా వాహనదారులు, డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపరాదని, భద్రతా నియమాలు తప్పక పాటించాలన్నారు. అతివేగం ప్రమాదకరమని పేర్కొన్నారు.

సేంద్రియ సాగుతో భూమి సారవంతం


వేరుశనగ పంటను పరిశీలిస్తున్న డీడీ గోపాల్

గంగాధరనెల్లూరు: సేంద్రియ ఎరువులు వినియోగిస్తే భూమి సారవంతంగా మారుతుందని జిల్లా వ్యవసాయ పరిశోధన డిప్యూటీ డైరెక్టర్ గోపాల్ తెలిపారు. శుక్రవారం మండలంలోని వీరకనెల్లూరు, బుక్కాపట్నంలో సాగు చేస్తున్న వేరుశనగ, కంది, రాగి, వరి పంటలను ఆయన పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ ఆరుతడి పంటలో మిశ్రమ పంటలు సాగు చేయవచ్చని సూచించారు. తక్కువ పెట్టుబడితో మంచి దిగుబడి సాధించవచ్చన్నారు. అలాగే రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో ఏడీఏ లక్ష్మీప్రసన్న, ఏఓ వందన, ప్రమీల పాల్గొన్నారు.

రోడ్డు నియమాలు పాటించాలి


వాహనదారులకు సూచనలు ఇస్తున్న సీఐ

నగరి: ప్రతి ఒక్కరూ రోడ్డు నియమాలు పాటించాలని నగరి రూరల్ సీఐ రాజశేఖర్ పేర్కొన్నారు. ఆయన శుక్రవారం పన్నూరు సబ్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లు, ద్విచక్రవాహనదారులకు రోడ్డు నియమాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలను వేగంగా నడపడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. అలాగే సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ నడపరాదన్నారు. పిల్లలకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమన్నారు. లైసెన్స్ కలిగి ఉండాలని, వాహనాలకు ఇన్సూరెన్స్ ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ వీరభద్రం, విజయపురం, నిండ్ర ఎస్ఐలు నరేష్, వెంకటసుబ్బమ్మ, ఏఎస్ఐ లోకనాథం పాల్గొన్నారు.

రథసప్తమి నిర్వహణపై కమిటీ సమావేశం


ఆలయ అధికారితో చర్చిస్తున్న కమిటీ సభ్యులు

నగరి: పట్టణంలో టీటీడీ ఆధీనంలో ఉన్న భూనీళ సమేత కరియమాణిక్య స్వామి ఆలయంలో ఈ నెల 28న రథసప్తమిని ఘనంగా నిర్వహించాలని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కోరారు. వారు శుక్రవారం ఆలయ అధికారి వెంకటరమణతో సమావేశమయ్యారు. రథసప్తమి ఏర్పాట్లపై ఆరా తీశారు. ఆలయ అధికారి మాట్లాడుతూ ప్రత్యేక ఆర్జిత కల్యాణోత్సవంలో పాల్గొనదలచిన భక్తులు రూ.500 చెల్లించాలన్నారు. రథసప్తమి రోజున ఉదయం 9 గంటలకు కరియమాణిక్య స్వామికి తిరుమంజనం నిర్వహిస్తామని, సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు భూనీళ సమేత కరియ మాణిక్యస్వామికి కల్యాణోత్సవం చేస్తామన్నారు. దంపతులు సంప్రదాయ దుస్తులు ధరించి రావాలన్నారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు ధన్వంతరి ఆచార్యులు, మారుతీ ప్రసాద్ ఆచార్యులు, వేదపారాయణ పండితులు రాం ప్రసాద్ పాల్గొన్నారు.

మత్తుకు అలవాటు పడితే అనర్థం


ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసు అధికారులు

కార్వేటినగరం: మత్తుకు యువత దూరంగా ఉండాలని, అలవాటు పడితే అనర్థాలు తప్పవని ఎస్ఐ దస్తగిరి స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల వినియోగిస్తే వాటిల్లే ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ డ్రగ్స్ వాడితే జ్ఞాపకశక్తి నశించిపోతుందన్నారు. చిన్న వయసులోనే అనేక రుగ్మతల బారిన పడతారని వెల్లడించారు. మాదక ద్రవ్యాలను అరికట్టడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు. ఎక్కడైనా డ్రగ్స్ విక్రయిస్తుంటే 14500 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం మాదక ద్రవ్యాలను వినియోగించమంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ విజయులురెడ్డి, ఎక్సైజ్ సీఐ నాగరాజు, ఎస్ఐ భాస్కర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ ధనుంజయరెడ్డి పాల్గొన్నారు.

కాలనీల్లో వసతులు కల్పించండి


పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ విద్యావతి

పాలసముద్రం: శ్రీబొమ్మరాజుపురంలోని జగనన్న లేఅవుట్‌లో గృహ నిర్మాణ పనులను ఎంపీడీఓ విద్యావతి శుక్రవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయించాల్సిన బాధ్యత ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై ఉందన్నారు. కాలనీల్లో మౌలిక వసతులను పకడ్బందీగా కల్పించాలని ఆదేశించారు. లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో విస్తరణాధికారి రమేష్, పంచాయతీ కార్యదర్శులు హరి, సుధాకర్ పాల్గొన్నారు.